-విద్వాన్ ఆచార్య

# కథ కంచికి



ఉగాది కథల పోటీలో ఎంపికైన కథ

అది స్టార్ హోటల్ ఏ.సి. గది. మధ్యలో టేబుల్, దాని మీద ఖరీదైన మందు, దానికి తగిన విందు అమర్చి ఉంది. టేబుల్ చుట్టూ నలుగురు కూర్చొని, తాము తీయబోయే 'సినిమా' కథను చర్చించుకొంటున్నారు. అప్పటికే కొంత చర్చ జరిగిందనడానికి గుర్తుగా సగం ఖాళీ అయిన మందు బాటిల్స్, యాష్ట్రేలో సిగరెట్ పీకలు కనబడుతున్నాయి. నిర్మాత, హీరో, దర్శకుడు మధ్య చర్చ జరుగుతోంది. మధ్య మధ్య రచయిత కూడా తన కథని గూర్చి ఒకటి రెండు మాటలు మాటాడుతున్నాడు నిశ్శబ్దాన్ని భంగం చేస్తూ.

"సరేలెండి నిరంజనంగారు! మీరన్నట్లు పెళ్ళికాకుండానే హీరోయిన్ పిల్లవాణ్ణి కనేటట్లు కథలో మార్పు చేద్దాం" సరేనా! అని 'అయ్యా! కవిగారు మీ కథని అలా మార్చండి, అప్పుడు మీ కథ చాలా రక్తి కడుతుంది.' అన్న దర్శకబ్రహ్మ 'వీరేంద్రతో రచయిత గిరీశం బేలగా చూస్తూ "వీరేంద్రగారు! నా కథ ముఖ్యంగా దేశభక్తి పూరితమైంది కదా! మీరు మరచిపోయారేమో మరోసారి గుర్తుచేస్తాను వినండి."

"భర్త 'కార్గిల్' యుద్ధభూమిలో ఉండగా ఊళ్ళో ఉన్న భార్య కొడుకుని కంటుంది. యుద్ధం ముగియగానే యింటికి వచ్చి భర్త కొడుకుని చూసి మురిసిపోతాడు అని ఎదురుచూస్తున్న ఆమెకి, యుద్ధంలో మరణించిన భర్త 'శవ పేటిక' ఇంటికి వస్తే, సాధారణ స్త్రీలా రోదించకుండా, దేశంకోసం యుద్ధభూమిలో వీరమరణం పొందిన తన భర్త శవపేటిక మీద ప్రమాణం చేస్తూ, 'తన కొడుకుని కూడా పెంచి పెద్దచేసి సైన్యంలో సిపాయిగా చేరుస్తాను' అని అంటుంది.

ఇది 'ప్లాష్‌బ్యాక్'లో చూపెడదాం. అని కదా అనుకొన్నాం. "తరువాత ఆర్మీలో శిక్షణ పూర్తిచేసుకొని కొడుకు యింటికి రావడం, తల్లి ఆనందంతో తన కొడుకుని ఊరివారందరికి గర్వంగా చూపెట్టడం"వరకు చర్చించేము కదా? "మరి యిప్పుడు పెళ్ళికాకుండా కొడుకుని కనడం సీను ఎలా కుదురుతుందండీ" అని అడుగుతున్న రచయితతో నిర్మాత ధనంజయరావు గ్లాసులో ఉన్న మందు పూర్తిచేసి, వేయించిన జీడిపప్పులు రెండు నోట్లో వేసుకొని...

"ఇదిగో రైటరూ, నీవు సెప్పిన కథ సానా బాగుంది. కాని డైరెక్టరుగారు, హీరోగారు, చెప్పినట్లు సిన్న సిన్న మార్పులు సేయాలమరి" తప్పదు. అంతేకాదయ్యో! నీ కథని మా పెద్దోడు కూడ విని తెగ మెచ్చుకొని, గొప్ప సలహాయిచ్చాడయ్యా, వాడంటాడు "డాడీ! హీరో సైనికుడికన్నా, డాక్టరో, ఇంజనీరో అయితే యూత్‌కి చాల బాగ నచ్చుతుంది. వాళ్ళు కూడా దేశ సేవ చేసేవారే కదా!" అని అన్నాడయ్యా. దీని సిగతరగ! చెప్పొద్దూ, నాక్కూడా ఆ పాయింటు నచ్చింది. అలా మారిస్తే పోలే. నువ్వు రాకముందు దీన్ని గురించే ఆలోచిస్తున్నాం. ఏమంటారు హీరోగారు" అన్న నిర్మాతతో.

"ఆహా! ఏం చెప్పేరండి ధనంజయగారు." ఈ మార్పు చాల అద్భుతంగా వుంది. "ఇదిగో కవిగారు, ఈ దెబ్బతో సినిమా ఇండస్ట్రీలో మీ కథ అదిరిపోవాలి. అలాగే హీరో హీరోయిన్ మొదటిసారి కలిసే సీను వెరైటీగా ఉండాలి. అది మన డైరెక్టరుగారు ప్లాన్ చేసారు. ఎలా ఉండాలో చెపుతారు వినండి" అన్న హీరో వైపు ప్రశంస పూర్వకంగా 'దర్శక బ్రహ్మ' వీరేంద్ర చూస్తూ, సిగరెట్టు గట్టిగా ఒక దమ్ములాగి చూడండి గిరీశంగారు-

హీరోయిన్ అడవిలో అడవి పిల్ల గెటప్‌లో ఉంటుంది. పట్నంలో డాక్టరుగా ఉన్న హీరో ఫ్రెండ్స్‌తో పిక్నిక్ ట్రిప్‌గా అడవికి వస్తాడు. అలా అలా ప్రకృతి అందాలు చూస్తూ పాట పాడుకొంటూ మిత్రులకి దూరంగా వెళ్తూ వుంటాడు. అప్పుడే అట్నుంచి, హీరోయిన్ 'కందిరీగ' తరుముతుంటే 'రక్షించండి, రక్షించండి' అని అరుస్తూ పరిగెత్తుకొంటూ వచ్చి, హీరోని గుద్దుకొంటుంది. వెంటనే హీరో ఆమెని గట్టిగా కౌగిలించుకొని, తన కాలి బూటు తీసి, పట్‌మని కొట్టి కందిరీగని చంపేస్తాడు. అప్పుడు హీరోయిన్ హీరో కళ్ళల్లోకి మత్తుగా చూస్తుంది. నాలుగు కళ్ళు కలుసుకొంటాయి, రెండు హృదయాలు ఒకటై డ్రీం సాంగ్ స్టార్ట్ అవుతుంది." ఇదండి హీరోహీరోయిన్ కలిసే సీను. ఇది మీ కథకి హైలెట్ అవుతుంది అంటున్న దర్శకుని వైపు అయోమయంగా చూస్తాడు రచయిత. హీరో మాత్రం-

వారెవ్వా! క్యాసీన్‌హై అని మెచ్చుకొంటూ, డ్రీం సాంగ్ మాత్రం 'స్విడ్జర్లాండ్'లో ప్లాన్ చేద్దాం. తరువాత సీన్ చెప్పండి వీరేంద్రగారు! అని రచయితని కాకుండా దర్శకుణ్ణి అడుగుతాడు హీరో. అపుడు దర్శకరత్న సీన్ వివరిస్తూ-

'సాంగు అయిపోయిన వెంటనే హీరోయిన్ నదిలో స్నానంచేసే సీను పెడదాం. ఇక్కడ హీరోయిన్ చేత 'స్కిన్‌షో' చేయించవచ్చు. ఆ తరువాత యిద్దరూ ఒకటయిపోయి, అన్నీ యిచ్చిపుచ్చుకుంటారు. ఆపై హీరో "యిప్పుడు నేను రాను, పట్నం వెళ్ళి మా వాళ్ళందరికి నీ గురించి చెప్పి, వాళ్ళని ఒప్పించి మరల వచ్చి నిన్ను మీ వాళ్ళ అనుమతితో పెళ్ళాడి, మా యింటికి తీసుకొని వెళతాను. అందాక యిదిగో నా గుర్తుగా నా అడ్రసు కార్డు నీ దగ్గర వుంచుకో, నా వాచి నీ చేతికి కడుతు

న్నాను'' అని వాచి ఆమె చేతికి తొడిగి'' పంచభూతాల సాక్షిగ, ఈ అడవి తల్లి సాక్షిగ మన పెళ్ళి అయిపోయినట్లే'' అని చెప్పి పట్నం వచ్చేస్తాడు-


హీరోయిన్ కూడా హీరోని వదల లేక, వదల లేక, వదిలి కోయ గూడానికి వెళ్ళిపోతుంది. ఇక్కడ మనం విశ్రాంతి యిద్దాం''అని వివరించిన దర్శకుణ్ణి అభినందిస్తూ నిర్మాత, హీరో చప్పట్లు కొడతారు. ఆ ముగ్గురి వైపు రచయిత అయోమయంగా చూస్తూ ''మరి నా కథలో కార్గిల్ యుద్ధం, దేశభక్తి చూపడం ఎలా'' అని నీళ్ళు నములుతున్న రచయితతో నిర్మాత ధనంజయ యిలా అంటాడు.

''చూడు రైటరూ నువ్వు మొదటిసారి కథ చెప్పగనే మేము బాగుంధి! అన్నామా? లేదా? ఆహ! అందుకే కదయ్యా! నిన్ను కూర్చోబెట్టి, నీ కథలో మార్పులు, చేర్పులు చర్చిస్తున్నది. మన పిక్చర్ బాగా ఆడి నాలుగు డబ్బులు నాకు కూడా రావాలి గదా! అలాగే అటు హీరోకి, డైరెక్టర్‌కీ, రచయితగా నీకు, పేరూ, డబ్బూ రావాలికదా! అలాంటప్పుడు నీ కథలో ఇలాటి మార్పులు, మసాలాలు తప్పవయ్యా బాబు. ఇక 'దేశ భక్తి' అంటావా? అది కూడా మేం ముగ్గురం ప్లాన్ చేసాం ఏలాగంటే డాక్టరైన హీరో పేదోళ్ళకి, గొప్పోళ్ళకి తేడా లేకుండా, అందరి దగ్గర 'ఫీజు' సమానంగా తీసుకొంటు ప్రజాసేవ చేస్తున్నట్టు రాసేయి. ప్రజాసేవ కూడా దేశభక్తే కదుటయ్యా సామి! ఏటంటారు? డైరెక్టరు గారు!'' అన్న నిర్మాతతో డైరెక్టర్ ''చాల బాగచెప్పేరు, ధనంజయగారు'' అని గిరీశం వైపు తిరిగి ''కవిగారు! మీ కథలో ఈ మార్పులు చేసి, స్క్రీన్‌ప్లే కూడా మీరే రాసి తీసుకురండి. అన్నట్లు విశ్రాంతి తర్వాత జరిగే కథలో మన హీరోగారు ఒక మంచి టర్నింగ్ పాయింటు చెప్పేరు అది కూడా చేర్చండి, అదేలా అంటే...

''హీరో డాక్టర్ కదా! ప్రాక్టీసుతో బిజీగా వుండి, హీరోయిన్ సంగతి మర్చిపోతాడన్నమాట. అక్కడ అడవిలో హీరోయిన్ హీరోకోసం ఎదురుచూస్తూ వుంటుంది.

ఇక్కడ మనం ఒక విరహ గీతం పెడదాం. అలాగే వారి కలయికని వెరైటీగా మరలా ఫ్లాష్ బ్యాక్‌లో చూపిద్దాం. తరవాత ప్రెగ్నెన్సీ, కొడుకు పుట్టడం, ఆమె తల్లిదండ్రులు కూతుర్ని, మనవడిని తీసుకొని, హీరోయిచ్చిన విజిటింగ్ కార్డు పట్టుకొని, పట్నం బయలుదేరుతారు అన్న పాయింటు మీ కథలో చేర్చి రాయండి. ఇక్కడి నుంచి మీ కథ మంచి సస్పెన్స్‌తో నడుస్తుంది'' అని వివరించిన దర్శకునితో.

''అయ్యా! నా కథలో హీరోయిన్ పాత్ర చాల ఉదాత్తమైనది కదండీ! మరి కొడుకుని బాగా చదివించి, ఆర్మీలో చేర్చి దేశ సేవ చేయించడం, అది! ఎలా చూపెడదాం?''అని అమాయకంగా అడుగుతున్న రచయి



తతో నిర్మాత ''తస్సదియ్యా! బలే పాయింటు సెప్పేవయా రైటరూ, కొడుకు పాత్ర ఎలా వుండాలో మేం ముగ్గురం ఎప్పుడో నిర్ణయించేసాం. అది మన హీరో గారు చెపుతారు, అలా రాసేయ్! అదిరిపోద్ది'' ఇటు క్లాసుకి, అటు మాస్‌కి చానా బాగా, నచ్చుద్ది. 'చెప్పండి హీరోగారు' అని దర్శకునివైపు తిరిగి, ''ఏటంటారు డైరెక్టరుగారు'' అన్న నిర్మాతతో ''అలాగే కానీండి. హీరో గారు ఎలా చెపితే, అలాగే కానిద్దాం, చెప్పండి నిరంజనంగారు'' అని దర్శకబ్రహ్మ వీరేంద్ర అన్న వెంటనే హీరో నిరంజనం ఓ పెగ్గు మందు లాగించి, గట్టిగా ఓ దమ్ము లాగి ''చూడండి గిరీశంగారు... జాగర్తగా వినండి.''

''హీరోయిన్ తలిదండ్రులతో కొడుకుని తీసికొని పట్నం వస్తుంది. హీరో అడ్రస్సు కష్టపడి కనుక్కొని అతని క్లినిక్‌కి వస్తుంది. హీరో వీళ్ళని కలవడానికి నిరాకరించడమే కాకుండా, మీరెవరో తెలీదు పొమ్మంటాడు. అపుడు హీరోయిన్ అతడిచ్చిన వాచీని చూపించి, గతం గుర్తుచేస్తుంది. అయినాసరే హీరో తెలీదుపొమ్మంటాడు. ఇక్కడ మనం మీ కథలోని హీరోయిన్ ఉదాత్తతని చూపెడదాం- ఎలా? అంటే?-

హీరోచే తిరస్కరింపబడ్డ హీరోయిన్ వాచీని అతని మీదకి విసిరికొట్టి, కొడుకుని తీసికొని బయటకు వస్తుంది. అదే వూళ్ళో వేరేచోట వుండి కూలి పనిచేసి, అప్పడాలు వత్తి, మిషన్ కుట్టి ఇలా చాలా చాలా కష్టాలు పడి, కొడుకుని పెంచి, బాగా చదివించి, డాక్టర్ని చేస్తుంది. ఇదంతా ఓ పాటలో చూపెడదాం. కొడుకు పాత్ర కూడా నేనే వేస్తాను. అంటే డబుల్ రోల్ అన్నమాట. ఇక్కడనుంచి మీ దేశభక్తి పాయింట్‌ని టచ్ చేద్దాం. డాక్టరుగా కొడుకు ఆర్మీలో చేరతాడు. యుద్ధంలో దెబ్బతిన్న సైనికులకు, రాత్రనక, పగలనక సేవ చేసి, చేసి సైనికుల్ని కాపాడుతాడు. అందుకుగాను రాష్ట్రపతి మెడల్‌ను భారతదేశం ప్రకటిస్తుంది. రాష్ట్రపతి చేత గౌరవింపబడే సీన్ పెడదాం. ఆ సన్నివేశాన్ని టి.వి.లో చూస్తున్న హీరో కొడుకుని గుర్తించి, వెంటనే భార్య, కొడుకుల వద్దకు వెళ్తాడు. హీరోయిన్ కన్నీళ్ళతో భర్తని క్షమించేస్తుంది. కొడుకుని, భార్యని దగ్గరకు తీసుకొని ఆనందభాష్పాలు రాలుస్తాడు హీరో. శుభం కార్డు పడుతుంది.'' ఇదీ సీన్ ఎలా ఉంది? ఈ దెబ్బతో మీ కథ సూపర్, డూపర్ హిట్ అవుతుంది. అని ముగిస్తాడు.

ఆ ముగ్గురి వైపు రచయిత ఓ వెర్రిచూపు చూసి, రెండు చేతులూ జోడించి, ''మహాప్రభో! మీరు చెప్పింది నా కథ కాదు. 'నా కథ ఎప్పుడో కంచికి' చేరిపోయింది. ఇది మహాభారతంలోని శకుంతల-దుష్యంతుల కథని కాపీకొట్టినట్లుంది. ఆవగింజంతైనా కథ యిందులో లేదు. కనుక ఈ కథకి మీ పేరే పెట్టుకొని సినిమా తీయండి'' అని చెప్పి గబగబా వెళ్ళిపోతున్న రచయిత గిరీశం వైపు ''వీడెవడండీ బాబు!'' అన్నట్లు చూస్తూ నవ్వుకుంటారు ముగ్గురూ.

★

# ఇలా జరుగుతోంది...

★ *బ్రిటన్ పోస్ట్ ఆఫీస్ 1500 టెలిఫోన్ వాడేవారిని సర్వేచేసి వింత విషయం తెల్సుకుంది. అదేమంటే 40% పురుషులు, 27% స్త్రీలు ఫోన్‌లో మాట్లాడేప్పుడు నగ్నంగా ఉంటారుట. ఫోన్ రిసీవ్ చేసుకునేప్పుడు పాపం వారికి దుస్తులు ధరించే టైం ఉండదుట. ఇంకొంత మంది కావాలనే నగ్నంగా స్త్రీలతో మాట్లాడ్తారుట. మరి మన దేశంలో సిన్మాల్లో ఇలా అర్ధనగ్న ఫోన్ సంభాషణలు చూపెడ్తారు కాబట్టి, ఈ తంతు బహుశః చాటుగా జరుగుతున్నదేమో మనకి తెలీదు సుమా! అందులో మన. రాష్ట్రం ఇలాటి వాటిల్లో ఫాస్ట్‌గదా?*

★ *రేప్ చేయబడ్డ స్త్రీ గర్భం దాలిస్తే అది ఆమె తప్పా? అమెరికాలోని 7 రాష్ట్రాల్లో అన్ని ఆసుపత్రుల్లో, మెడికల్ కాలేజీల్లో ఒక ఆదేశం జారీ చేశారు. అదేమిటంటే రేప్ చేయబడ్డ స్త్రీకి 72 గంటల్లోపలే గర్భం రాకుండా కాపాడే ఏర్పాట్లు చేయాలి. కానీ కాథలిక్ చర్చి మాత్రం దీన్ని ససేమిరా అంటోందిట! వారి అభిప్రాయం ప్రకారం గర్భం అనేది జీవితానికి ప్రారంభం, పవిత్ర కార్యం అని, దాన్ని ఆపటం పాపం అని వారి అభిప్రాయం. మరి రేప్ చేసేవాడు పవిత్రుడు! పుట్టిన కందు అనాధ అయితే చెత్తకుప్పలో పడ్తే ఆ పాపం ఎవరిదో? వెర్రి వేయి తలలంటే ఇదే! నాగరిక దేశాలు అనాగరిక ధోరణిలో ఉన్నాయి మరి!*

★ *హింద్ మహ్మద్- సౌదీకి చెందిన అందమైన టాలెంటెడ్ సినీ నటి. తన తొలి సౌదీ ఫిల్మ్ కైఫుల్‌హాల్ (మీరెలా ఉన్నారు)లో నటించింది. వింత ఏమంటే ఆ సిన్మా షూటింగ్ సౌదీ అరబ్‌లో జరగలేదు. ఆ సిన్మాని అక్కడ చూపరు. కారణం సిన్మాలు నిషేధం. మరి దుబాయిలో షూటింగ్ జరిగి మిడిల్ ఈస్ట్ దేశాల్లో రిలీజ్ అవబోతోంది. మరి ఆమెకి ఇది నవ్వాలో ఏడ్వాలో తెలీని స్థితి!*

★ *మోడర్న్ సైన్స్ కళ్ళకి కాటుకను పూర్తిగా వ్యతిరేకిస్తుంది. మన దేశం ఇంకా ఇతర ఆసియా దేశాలు కాటుక, సుర్మాని నిషేధించాయి. కారణం- ఇందులో సీసం (లెడ్) ఎక్కువగా వాడబడటమే. కళ్ళ స్కిన్‌కి లెడ్ చాలా హానికరం. పైగా దృష్టిపోయే ప్రమాదం ఉంది. ఇంట్లోని కాటుకను మన బామ్మల కాలంలోలాగా పెట్టుకోండి కావాలంటే.*

★ *నేటి అమ్మాయిలు అమ్మానాన్నలకి తెలీకుండా ప్రేమించి పెళ్లాడటం, పారిపోవటం ఎక్కువైంది. మరి పోలీసు రిపోర్టులో మాత్రం "మా అమ్మాయి అపహరణకు గురైంది'' అంటున్నారు. మధ్యలో ప్రియుడు ఇరుక్కుపోయి జైలుపాలవుతున్నాడు. అబ్బాయి అమ్మానాన్నలు కుళ్లి ఏడవాల్సి వస్తోంది. పూల గుత్తిలాంటి కొత్త జంట జీవితం కాక్టస్ మొక్కలా మారుతోంది ఈ కిడ్నాప్ అనే పదం వలన.*

★ *నేటి చదువుకున్న యువతులు కూడా ఆత్మహత్య చేసుకుంటున్నారు. కారణం..? ఢిల్లీలో ఓ స్త్రీ "పిల్లలు పుట్టాక నేను ఉద్యోగం చేయను'' అని భీష్మించింది. ఆమెకి పిల్లల్తో ఇంట్లో ఉండాలని కోరిక. కానీ భర్తవైపునించి వత్తిడి పెరగటంతో ఆత్మహత్య చేసుకుంది కానీ పిల్లల తరపున ఆలోచించలేదు మరి! చిన్నప్పట్నించీ చదువు, కెరీర్, పెళ్లి ఆపై పిల్లలు పుట్టినా స్త్రీ మనఃపూర్వకంగా జాబ్ చేయదల్చుకోకపోతే వత్తిడి, బి.పితో పిచ్చిదానిలా మారుతుంది మరి!*

**-విజయశ్రీ**